క్లుప్తంగా

సీఐటీయూ మండల కన్వీనర్‌గా శ్రీనివాస్

కేశంపేట: సీఐటీయూ మండల కన్వీనర్‌గా బేరి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా నియమించారు. మండల కేంద్రంలో సీఐటీయూ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు బీస సాయిబాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్‌లు పాల్గొని మండల కన్వీనర్‌గా శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సీఐటీయూ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మమత, వసంత, సుజాత, అక్కమ్మ, సావిత్రి, రజిత, వెంకటమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్‌ఐలు బదిలీ


వరప్రసాద్


కుప్పగిరి లింగం

కేశంపేట: షాద్‌నగర్ రూరల్ సీఐ డీకే లక్ష్మిరెడ్డి, కేశంపేట ఎస్‌ఐ బీఎస్ఎస్ వరప్రసాద్‌లు బదిలీ అయ్యారు. షాద్‌నగర్ రూరల్ సీఐని హైదరాబాద్ రేంజ్ జోన్‌లో రిపోర్టు చేయాల్సిందిగా, ఎస్‌ఐని శంషాబాద్ ఆర్జీఐఏకు బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డిని షాద్‌నగర్ సీఐగా, అత్తాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న కుప్పగిరి లింగంను కేశంపేట ఎస్‌ఐగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలతో సత్సంబధాలు కలిగి ఉన్న ఎస్‌ఐని సంవత్సర కాలం లోపే బదిలీ చేయడంపై కేశంపేటలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ బదిలీ కావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: మండలకేంద్ర సమీపంలోని పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ పాటించకుండా కొనసాగుతున్న పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి షకీల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. లెడ్ బట్టీలు, పాత టైర్లను కాల్చే పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో ఘాటైన వాయు కాలుష్యం వెలువడుతుందని ఆయన పేర్కొన్నారు. వీటి నిర్వాహకులు సరైన అనుమతులు తీసుకోకుండా కొందరు నాయకులు, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా పీసీబీ, రెవెన్యూ అధికారులు స్పందించి కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు


మాట్లాడుతున్న రాజు

కేశంపేట: ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మికసమ్మె–గ్రామీణ భారత్ బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదేళ్లు పూర్తవుతున్నా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి పర్మినెంట్‌తో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపుల సమస్యలను కేంద్రం పరిష్కరించలేదన్నారు. ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, శ్రీనివాస్, మమత, వసంత, సుజాత, అలివేలు, అక్కమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

కొత్తూరు: ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్తూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పెంజర్ల కూడలి వద్ద హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. సరైన వెలుతురు లేని కారణంగా కూడలిని దాటే క్రమంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే కూడలి వద్ద జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో వాహనదారులు మృత్యువాత పడ్డట్లు వివరించారు. సంబంధిత అధికారులు తాత్కాలికంగా సోలార్ లైట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కూడలిలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ప్రత్యేక పాలనకు కసరత్తు

- రేపటితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- పర్సన్ ఇన్‌చార్జిలుగా సర్పంచ్‌ల విన్నపాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- అధికారుల పాలనకు రంగం సిద్ధం



గ్రామ పంచాయతీ కార్యాలయం

మొయినాబాద్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన దాదాపు ఖరారైంది. ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సర్పంచులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించాలని వారు చేసిన విన్నపాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏయే గ్రామాలకు ఎవరిని నియమించాలనే కసరత్తు కొనసాగుతుంది. ఏ గ్రామానికి ఎవరిని నియమించనున్నారో, ఎవరెవరూ ప్రత్యేకాధికారిగా రానున్నారో ఒక్క రోజులో తేలనుంది. 2019లో ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు ఫిబ్రవరి 2న పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఐదేళ్ల పదవీ కాలం ఫిబ్రవరి1తో ముగియనుంది. అయితే ఇప్పటికే ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ 2023 డిసెంబర్‌లోనే కొత్త ప్రభుత్వం ఏర్పడింది. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. దీంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలన అనివార్యమయ్యింది. మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి ఓ ప్రత్యేక అధికారిని నియమిస్తే మొత్తం 28 మంది అధికారులకు బాధ్యతలు అప్పగించాలి. కానీ మండల స్థాయిలో 28 మంది గెజిటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారా ? చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ అధికారులను సైతం ప్రత్యేక అధికారులుగా నియమించాలా ? అనే అంశాలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల జనాభా వివరాలను, మండలంలోని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల వివరాలను మండల అధికారులు ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తుంది. ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను, తక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు నాన్‌గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు జిల్లా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్‌కు అవగాహన ఉందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అవలంభించిన విషయాన్ని గుర్తు చేశారు. మిషన్ భగిరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగిస్తుందో లేదోనని ప్రజలు అనుమానాలు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అంజయ్య యాదవ్ తెలిపారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి భయానికి లోను కావద్దని, తిరిగి తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటి వరకు ప్రజల పక్షాన, ప్రభుత్వ పథకాల అమలునకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, జగదీశ్వర్, మన్నె నారాయణ, ప్రభుదాసు, శ్రీను చంద్రశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో శాంతి యుతంగా పోరాటం సాగించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బస్వం, అప్పి తదితరులు పాల్గొన్నారు.

గంజ్ రోడ్డులో..

పట్టణంలోని గంజ్ రోడ్డులో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కానుగు అంతయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, రేటికల్ నందీశ్వర్, ప్రతాప్‌రెడ్డి, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, శ్రీశైలం, నాగిళ్ల గోపాల్‌గుప్తా, సుధీర్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి ఎస్‌ఐగా శ్రీకాంత్

తలకొండపల్లి: తలకొండపల్లి మండల నూతన ఎస్‌ఐగా ఎ.శ్రీకాంత్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. తలకొండపల్లి మండల పోలీస్ ఠాణాలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన శ్రీను హైదరాబాద్ అత్తాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ జగద్గిరిగుట్టలో సెక్టార్–3 ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించిన శ్రీకాంత్ తలకొండపల్లి మండలానికి బదిలీపై రానున్నారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరిశోధనలకు వ్యూహాత్మక భాగస్వామ్యం

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు కోనేరు లక్ష్మణ్ అవిష్

మొయినాబాద్ రూరల్: వ్యవసాయ బయోరిఫైనరీ కోసం ఏఐలో అత్యాధునిక పరిశోధనలు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యంలోకి ప్రవేశించినట్లు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు కోనేరు లక్ష్మణ్ అవిష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో అజీజ్‌నగర్ సమీపంలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, బయోరిఫైనరీ కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఏఐలో అత్యాధునిక పరిశోధనలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలోని సవాళ్లను పరిష్కరించేందుకు స్థిరమైన భవిష్యత్ కోసం వినూత్న పరిష్కారాలను అన్వేషించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రెండు ప్రముఖ సంస్థలు ఒకేచోట చేరి పరిశోధనలు చేయనున్నాయన్నారు. ఈ అవగాహన ఒప్పందం వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిని పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణా, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ శ్రీధర్, ఇంజనీరింగ్ విభాగాధిపతి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించండి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

చేవెళ్ల: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజేశ్ ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ భవనాలు పెచ్చులూడిపోతున్నాయని, వర్షానికి నీరు కారుతున్నాయని వాపోయారు. కిటికీలు ఊడిపోయి, గోడలు పగ్రెలు పాసి కూలిపోయే స్థితిలో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే శిథిలావస్థలో చేరిన హాస్టళ్లను తొలగించి నూతన భవనాలను నిర్మించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న ప్రధాన సమస్య నీటి కొరత పరిష్కరించాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు, పెంచాలని పూర్తిస్థాయి వార్డన్లను, వర్కర్లను నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కె జైపాల్, బి శ్రీకాంత్, న్యాల అశోక్, సురేశ్, నర్సింహ్మ, అశోక్, శివకుమార్, శ్రీశైలం, నిఖిల్, సాయికుమార్, అజయ్‌కుమార్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

గోవు, గోవిందుడు, గీత పరిరక్షణే ధ్యేయం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూజారులు

లక్షసాధన ఫౌండేషన్ యాత్ర నిర్వాహకుడు యోగేశ్

చేవెళ్ల: గోవు, గోవిందుడు, గీత పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని లక్షసాధన ఫౌండేషన్ యాత్ర నిర్వాహకుడు యోగేశ్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో మంగళవారం తిరుమల శ్రీవారి మహా పాదయాత్రలోభాగంగా వివేకనంద జూనియర్ కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భగవంతుడిని ఏ పేరుతో కొలిచిన దేవుడు ఒక్కడేనని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులను ఎప్పుడూ పూజించాలన్నారు. అనంతరం 27 ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పూజారి గట్టు రంగనాథచార్యులు, కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, లక్షసాధన ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, తిరుపతిరెడ్డి, శివస్వాములు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న నిర్వాహకులు

దేవునిఎర్రవల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి మహాపాదయత్రలో భాగంగా చేవెళ్లమండలంలోని దేవునిఎర్రవల్లిలో సోమవారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా ప్రతీ గ్రామంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం, అన్నదానం, భగవద్గీత ప్రచారం, పుస్తక వితరణ గోఆధారిత వ్యవసాయం, నక్షత్రవనం వనమూలికల మొక్కలు నాటడం వంటివి నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు టి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నూనె గింజల సాగుతో ఆదాయం

షాబాద్: నూనెగింజల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందొచ్చని పరిశోధన స్థానం రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీడీ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తిర్మలాపూర్‌లో సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం రైతులు సాగు చేస్తున్న తెల్ల కుసుమ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె గింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా రైతులకు అధిక దిగుబడి నిచ్చే ఐఎస్ఎఫ్–746 రకం కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. సంప్రదాయ విత్తనాలకు, భారతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ వారు అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడి విషయంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న పంటకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మార్కెట్లో నూనె ధరలు ఆకాశాన్నంటినందునా రైతులు నూనె గింజల పంట సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. రైతు సంఘం చైర్మన్ లింగం, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, అంజయ్య, భూపతి రాజు, శేఖరయ్య పాల్గొన్నారు.

భయం వీడి కష్టపడి చదవాలి

ఎంఈఓ శంకర్‌రాథోడ్


మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాబాద్: విద్యార్థులు భయం వీడి కష్టపడి చదవాలని షాబాద్ ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ఆమనగల్లు గురుకుల పాఠశాలలో పదోతరగతి పరీక్షల నిమిత్తం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అందుకు కావలసిన సాధనను విద్యార్థులతో చేయించాలన్నారు. కష్టపడితే మంచి ఫలితాలు తప్పకుండా వస్తాయని సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా తగిన ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన కోరారు. మార్చి 18నుంచి ప్రారంభయ్యే పరీక్షలకు సమయాన్ని వృథా చేయకుండా ఇప్పటినుంచే శ్రద్ధగా చదవాలన్నారు. సబ్జెక్టుల వారీగా ఆయా ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల సందేహాలకు తగిన విధంగా నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి కృష్ణ, ఆయా పాఠశాలల జీహెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విజ్ఞానంతో పాటు ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చదువుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని ఎస్వీ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో రాణించేందుకు క్రమ శిక్షణతో చదువుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

మల్లారెడ్డిగూడ సర్పంచ్ చందిప్ప జంగయ్య


గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చందిప్ప జంగయ్య

షాబాద్: గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మల్లారెడ్డిగూడ సర్పంచ్ చందిప్ప జంగయ్య పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాలె యాదయ్య అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించారన్నారు.

వాసవీక్లబ్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు


మాట్లాడుతున్న విశ్వనాథ నాగేశ్

ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ నాగేశ్

షాద్‌నగర్: వాసవీక్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందని ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ నాగేశ్ పేర్కొన్నారు. షాద్‌నగర్ వాసవి, వనితా క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని శ్రీరామలింగేశ్వర సహకార సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన వాసవీక్లబ్ మొదట్లో చిన్నచిన్న సేవా కార్యక్రమాలతో తన కార్యకలాపాలను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రతి ఏటా కోట్లాది రూపాయల సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. క్లబ్ చేస్తున్న ఈసేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. పేదలను ఆదుకునేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్థికంగా వెనకబడిన పది మంది చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలను అందజేశారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా గుడిపల్లి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ సురేశ్, కోశాధికారిగా కల్వ మాణిక్యం, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా కొండ రమ, ప్రధాన కార్యదర్శి కల్వ పుష్పలత, కోశాధికారిణిగా స్వప్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహ్మగుప్తా, దొంతు పాండురంగయ్య, పాలాది వెంకటరమణ, తాటి రాంచంద్రుడు, నవీన్‌కుమార్, కల్వ యాదగిరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

5నుంచి మీరాపూర్ దర్గా ఉత్సవాలు



షాబాద్: ఫిబ్రవరి 5 నుంచి 6వ తేదీ వరకు మీరాపూర్ దర్గా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెన్నాబాయ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మీరాపూర్ గ్రామంలోని దర్గాలో ప్రతీ సంవత్సరం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన దర్గాలో ఖవాలి, గంధం, నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లాలోని నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు.